క్లుప్తంగా

ముళ్లపొదలు తొలగింపు



జేసీబీతో ముళ్లపొదల తొలగింపు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ చిన్నచెరువు నుంచి పెద్ద చెరువుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలతో ఇబ్బందిపడుతున్నామని రైతులు మాజీ సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె సొంత డబ్బులతో సోమవారం జేసీబీతో ఇరువైపులా ముళ్లపొదలను తొలగింపజేయించారు. రైతులు మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అయ్యప్ప ఆలయ కమిటీ నిర్వహణపై వివాదం



ఆరోపణలు చేసుకుంటున్న దాతలు, భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ కమిటీ నిర్వహణపై ఐదు రోజులుగా వివాదం నెలకొంటుంది. కమిటీ అధ్యక్షుడిగా కార్యదర్శి సిరిమల్ల జయేందర్ తనకు తాను ప్రకటించుకోవడం, గురుస్వాములు, భక్తులను అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు. దీంతో సోమవారం ఆలయ ఆవరణలో గురుస్వాములు, స్వాములు, భక్తులు, దాతలు, కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జమ్మికుంట వ్యాపారులు, స్థల దాతకు తెలియకుండా, కమిటీ సమావేశం నిర్వహించకుండా అధ్యక్షుడిగా ఎలా ప్రకటించుకున్నావని ప్రశ్నించారు. దాతలు, భక్తుల సాయంతో నిర్మించిన గుడికి నియంతలా వ్యవహరించడం సరికాదని నిలదీశారు. నూతనంగా కమిటీని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వాగ్వాదం నెలకొనగా కార్యదర్శి జయేందర్ ఎవరిని ఉద్దేశపూర్వకంగా దూషించలేదన్నారు. సమావేశంలో గందరగోళం నెలకొనడంతో మే నెల 11వ తేదీకి సమావేశం వాయిదా వేశారు.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన



అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ కవిత

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్‌లో భాగంగా సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ. చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరానికి విటమిన్లు, ప్రోటీన్లు లభిస్తాయని తెలిపారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత, ఆశా వర్కర్ విజయలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో కంది తిరుపతిరెడ్డి, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌మంజుల దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, ఆయా గ్రామశాఖల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు మారముల్ల కుమారస్వామి అప్పుల బాధతో మృతి చెందాడు. రైతు స్వరాజ్య వేదిక వారు పరామర్శించి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి జీవనోపాధి కోసం కుటుంబానికి రూ.నలభై వేల విలువ గల మేకలను కొనిచ్చారు. కార్యక్రమంలో స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కొండాల్‌రెడ్డి, ముక్క ఐలయ్య, కన్నూరు సదానందం, రాచపల్లి సమ్మయ్య ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు వేయి కళ్లతో..

- ఎదురుచూస్తున్న ఆశావహులు
- ప్రజాపాలనలో 4,829 దరఖాస్తులు
- ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించిన అధికారులు
- నెలలు గడుస్తున్నా విడుదలకాని లబ్ధిదారుల జాబితా
- ఇందిరమ్మ కమిటీలపైనే భారం



బొమ్మనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు వేల కళ్లతో ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో చిన్నముల్కనూర్ తప్పా ఏ గ్రామానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తుల ఇళ్లకు వెళ్లి అన్ని వివరాలను పరిశీలించారు. మండలంలో 4,829 దరఖాస్తులు రాగా 970 దరఖాస్తులను తిరస్కరించారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు అర్హుల జాబితా విడుదల చేయకపోవడంతో దరఖాస్తుదారులు నిరాశలో ఉన్నారు. ఇంకెప్పుడు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని, ఉండేందుకు ఇళ్లు లేక, అద్దె కట్టలేక, ఉంటున్న పూరిగుడిసెలు, రేకులషెడ్లు సరిగాలేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామ ప్రత్యేకాధికారి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి, ఇద్దరు ఐకేపీ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. వీరు గ్రామాల్లో నిజమైన అర్హులను గుర్తించి మండల కేంద్రానికి పంపించాల్సి ఉంది. అక్కడ ఎంపీడీఓ నేతృత్వంలో జాబితా ఫైనల్ అవుతుంది. ఈ ప్రక్రియ వల్ల అర్హులు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ కమిటీల్లోని సభ్యులు తమకు అనుకూలంగా ఉన్నవారి పేర్లను సూచించిన వారికే మంజూరు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతోంది. కమిటీలు సూచించిన జాబితాను పరిశీలించి అర్హులను గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

పదేళ్లుగా రేకుల షెడ్డులో ఉంటున్నా



పదేళ్లుగా రేకుల షెడ్డులో ఉంటున్నా, ఇటుక మీద ఇటుక పేర్చి, కట్టెలు పాతి వాటిపై రేకులు వేసుకొని జీవనం సాగిస్తున్నా. ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేశాను పంచాయతీకార్యదర్శి నీకు ఇల్లు మంజూరు కాలేదంటున్నాడు. నేను ఇప్పుడు ఇల్లు కట్టకపోతే వర్షాకాలంలో ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది.

– వేల్పుల సంపత్, రేకొండ

అర్హులను గుర్తించాం



మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజాపాలనలో వచ్చి దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాం. బూత్‌ల వారీగా ఎనిమిది నుంచి పదిపేర్లు ఇవ్వాలని ఇందిరమ్మ గ్రామ కమిటీలను కోరాం. అవి రాగానే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయి.

– మధుసూదన్, ఎంపీడీవో, చిగురుమామిడి

అభివృద్ధి పనులు ప్రారంభం

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ కేజీబీవీలో అదనపు తరుగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

చొప్పదండి: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వ, తదితర రిజిస్టర్లను పరిశీలించారు.

అగ్ని ప్రమాదం



శంకరపట్నం: మండలంలోని కరీంపేట శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి సిగరేట్ తాగి పడేయడంతో ఎండుగడ్డి, చెట్లకు మంటలు అంటుకున్నాయి. ఎల్ఎండీ నీటిని యాసంగి పంటలకు వినియోగించుకున్న రైతులు కరీంపేట బ్రిడ్జి పక్కన విద్యుత్ మోటార్లు పెట్టుకున్నారు. ఈ మోటార్ల కోసం అమర్చిన విద్యుత్‌వైర్లకు మంటలకు అంటుకోగా.. గమనించిన రైతులు అదుపులోకి తీసుకొచ్చారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి

చిగురుమామిడి: ఈజీఎస్ కూలీలు ఉదయం ఆరున్నర వరకు పనిప్రదేశంలో ఉంటే ఎండతీవ్రత ఎక్కువగా ఉండదని, పదిన్నర వరకు పనులు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతందని మండల పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నవాబుపేట గ్రామపరిధిని శాంతినగర్‌లో ఫార్మేషన్ రోడ్డు పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. పనిప్రదేశంలో కూలీలకు నీరు, నీడ సౌకర్యం కల్పించాలని పంచాయతీ కార్యదర్శి సంపత్‌ను ఆదేశించారు. సరైన కూలీ రావడంలేదని కూలీలు ఆరోపించగా నిర్దిష్ట కొలతల ప్రకారం పనులు చేయాలని రాజశేఖర్ సూచించారు. ఎంతమంది కూలీలు వచ్చారని ఫీల్డ్ అసిస్టెంట్ ఆదిమల్లయ్యను అడిగారు. మాస్టర్‌లో తప్పులు లేకుండా చాడాలని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిహారం రాలేదని పనులు అడ్డగింత



ప్రొక్లెయిన్ వద్ద రైతుతో మాట్లాడుతున్న పోలీసులు

శంకరపట్నం: జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయిన వ్యవసాయబావికి పరిహారం రాలేదని సోమవారం రోడ్డు పనులు అడ్డుకున్న రైతుపై డీబీఎల్ కంపెనీకి చెందిన సైట్ ఇంజినీర్ దాడి చేశాడు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాసు మచ్చయ్య, కొమురయ్య అన్నదమ్ములు, వీరికి కొత్తగట్టు గ్రామంలో వ్యవసాయభూములున్నాయి. భూములకు వ్యవసాయబావి నుంచి సాగునీరు అందుతోంది. 2021జూన్ 30న రోడ్డు నిర్మాణంలో భాగంగా వ్యవసాయబావిని కోల్పోతున్నందుకు పరిహారంగా రూ.2.51 లక్షలు మంజూరు అయ్యాయి. అయినప్పటికీ నేటికి పరిహారం రాలేదని బావి పూడ్చే పనులను రైతు మచ్చయ్య అడ్డుకున్నాడు. రైతుపై పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌కు చెందిన సైట్ ఇంజినీర్ దాడి చేశాడని డయల్ 100 ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతులు దాడి చేశారని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో సైట్ ఇంజినీర్ నిరంజన్ ఫిర్యాదు చేశాడని ఏఎస్సై సుధాకర్ తెలిపారు. ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారని, రైతుపై దాడిని పలువురు ఖండిస్తున్నారు. ఈ విషయంలో పలువురు రాజీకి రైతుపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది.

వృద్ధుడి ఆచూకీ లభ్యం

జమ్మికుంట: మతిమరుపుతో అదృశ్యమైన వృద్ధుడి కేసును పోలీసులు ఛేదించారు. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు.. హనమకొండ జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో నివాసం ఉండే రామగిరి రాజయ్య భార్యతో కలిసి సొంత గ్రామం వీణవంక మండలం చల్లూర్‌కు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మతిమరుపు, అనారోగ్య కారణాలతో జమ్మికుంటలో రైలు ఎక్కి హైదరాబాద్‌లో దిగాడు. ఈ నెల 14న జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారం తెలుసుకున్న వృద్ధుడి రెండో కుమారుడు పోలీసులకు సమాచారం అందించాడు. జమ్మికుంట హెడ్ కానిస్టేబుల్ సంపత్, హోంగార్డు యాకూబ్ వృద్ధుడిని మరో కుమారుడు రాజుకు అప్పగించారు.

ప్రాజెక్ట్ మిత్ర ప్రారంభం

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ సైనిక శిక్షణ పాఠశాలలో అధికారులు ప్రాజెక్టు మిత్ర పథకం ప్రారంభించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడటానికి టెలిఫోన్ బాక్స్ ఏర్పాటు చేశారు. ఫోన్లు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా పని చేస్తాయని టెక్నీషియన్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సాంబయ్యపల్లెలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణ, ఉపేందర్‌రెడ్డి

గన్నేరువరం: మండంలోని యాస్వాడ, ఖాసీంపేట, పారువెల్ల, చాకలివానిపల్లె, సాంబయ్యపల్లె, చీమలకుంటపల్లె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లావణ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరిపూర్ణాచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సయ్య, నాయకులు తిరుపతి, అంజయ్య, సంపత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తిరుపతి, నర్సింహారెడ్డి, మల్లికార్జున్, తిరుపతిగౌడ్, రాజయ్య, రాంరెడ్డి, తిరుపతి, ప్రశాంత్, అంజనేయులు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి



ఇళ్ల యజమానులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

గంగాధర: రోడ్డు విస్తరణకు సహకరించి వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మండలంలోని ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, తాడిజర్రి, గర్శకుర్తి గ్రామాలకు చెందిన నాయకులు, గ్రామస్తులు సోమవారం కురిక్యాల గ్రామానికి వచ్చి రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇంటి యజమానులను వేడుకున్నారు. కురిక్యాల బస్టాండు నుంచి గ్రామ శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లతో దారి ఇరుకుగా మారింది. కురిక్యాల నుంచి గర్శకుర్తికి రోడ్డు మంజూరైంది. గ్రామంలో రోడ్డు విస్తరణ చేయనివ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. రోడ్డు విస్తరణ, నిర్మాణానికి సహకరించాలని వేడుకోవడంతో పలువురు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఈదురుగాలులకు కూలిన ఇంటి పైకప్పు



సరితను పరామర్శిస్తున్న నాయకులు

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గుండేటి సరిత ఇంటి పైకప్పు ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. పేద కుటుంబానికి చెందిన మహిళను ఆదుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితురాలితో ఫోన్‌లో మాట్లాడిన ప్రణవ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కిరణ్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు రాధ, నాయకులు ఉమాపతిరావు, ఎండీ చాంద్‌పాషా, సదానందం సంపత్, రాజు,రాజమౌళి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణమూర్తి, రవి, ఓదెలు తదితరులున్నారు.

నలుగురిపై కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన శ్రావణికి హైదరాబాద్‌కు చెందిన గొట్టిముక్కల అశ్విన్‌కుమార్‌తో 2022లో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. పెళ్లయిన కొద్ది రోజులకు భర్త దుబాయి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అత్తమామలు నిర్మల, బాలాజీ, ఆడపడుచు రాజేశ్వరితోపాటు భర్త అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా హింసించారని బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని టౌన్ సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: మండలంలోని మానేరు పరివాహక ప్రాంతం విలాసాగర్ గ్రామ సమీపం నుంచి అక్రమంగా ఇసుక తరలింపుపై తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ అధికారులతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి కార్యాలయానికి తరలించామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మండల కేంద్రం నుంచి చిన్నకోమటిపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. అడుగడుగున గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఏళ్లుగా రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదని సంబంధిత అధికారులు సత్వరం స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ, ఇల్లందకుంట సెల్ నంబర్: 63015 38145

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు



చిగురుమామిడి: బడిబాటలో విద్యార్థులు, టీచర్లు



రామడుగు: రంగసాయిపల్లిలో ...

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని ప్రధానోపాధ్యాయులు కిషన్‌నాయక్ తెలిపారు. పాఠశాలలో ఇటీవల తాగునీటి సౌకర్యం, శానిటేషన్, పాఠశాల చుట్టూ ప్రహరీ, కిచెన్‌షెడ్డు, మరుగుదొడ్ల ఇతర మైనర్ మరమ్మతులు చేశామన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. బడిబాటలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్‌పర్సన్ జి. రజిత, ఉపాధ్యాయులు ఎం. స్వరూప, ఖదీర్‌పాషా, జి.సునీత, టి.వాణి విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లిలో సోమవారం రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరుతూ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జీపీవీ రంగనాథశర్మ, ఉపాధ్యాయులు అవధూత శ్రీనివాస్, కరుణాకర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా బండరాళ్ల తరలింపు



మానకొండూర్: కరీంనగర్–వరంగల్ నేషనల్ హైవే 563 రహదారిపై లారీలో బండరాళ్లను ఇష్టారాజ్యంగా తరలిస్తుండటంతో ప్రమాదంలో పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీ వెనక భాగంలో డోర్ లేకపోవడంతో బండరాళ్లు రహదారిపై పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ట్వినింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. మండలంలోని మాచనపల్లి, ధర్మారం, శాయంపేట, సైదాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు విద్యార్థులకు ఉపన్యాసం, ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహించారు. ఏఈవో హేమలత మాట్లాడుతూ.. అన్ని పాఠశాల విద్యార్థులను ఒక చోట చేర్చి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన నైపుణ్యం పెంపొందుతుందని అన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, సీఆర్పీలు సురేష్, శ్రీనివాస్, నాగరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, లింగయ్య, సుచరిత, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేశవపట్నం మోడల్ స్కూల్‌ను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్ సందర్శన

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్‌ను సోమవారం కాచాపూర్, రాజాపూర్, లింగాపూర్, ఆముదాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. మోడల్‌స్కూల్‌లోని సైన్స్, కంప్యూటర్ తదితర ల్యాబ్‌లతోపాటు లైబ్రరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, ప్రిన్స్‌పాల్ సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.